క్లుప్తంగా

ఆడపిల్లలకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న అధికారులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామంలో మంగళవారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ఆడిపిల్లలకు 18 ఏళ్ల నిండే వరకు వివాహం చేయొద్దని, ఉన్నత చదువులు చదివించాలని, మగవారితో సమానంగా ఆడపిల్లలకు తల్లిదండ్రులు ప్రధాన్యత ఇవ్వాలన్నారు. భ్రూణహత్యలు చేయకూడదని, చిన్న వయస్సు నుంచి పౌష్టికాహారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాహితి, సర్పంచ్ అటికం శారధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇష్రత్ సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు అటికం రజిత, సరోజన, కార్యదర్శి మల్లికార్జున్, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన కాంగ్రెస్ నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జమ్మికుంట: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జమ్మికుంట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కసుబోజుల వెంకన్న, ఎండీ సలీం పాషా, వొల్లాల శ్రీనివాస్, చిన్నింటి నాగేంద్ర,మారపల్లి శ్రీనివాస్ సందీప్‌లు పాల్గొన్నారు. ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధిగా డాక్టర్ మల్లు రవి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియామకమైన వేణుగోపాల్‌ను జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పదవీకాలం పొడిగించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

సైదాపూర్: సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నందున, ఎన్నికలు నిర్వహించకుండా సర్పంచులనే పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలని ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీడీవో కార్యాలయంలోని సూపరింటెండెంట్ ప్రేమ్ సాగర్, ఎంపీవో సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని 26 జీపీల్లో 21 మంది సర్పంచులు బీఆర్ఎస్‌కు చెందినవారే. మంగళవారం 15 మంది సర్పంచులు వినతిపత్రం అందజేశారు. గెలిచాక తొమ్మిది నెలల తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచులకు చెక్‌పవర్ ఇచ్చిందని, రెండేళ్లు కరోనాతో నిధులు లేకున్నా చేసిన పనులకు బిల్లులు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు పద్మజ, గణేశ్, రాములు, కొంరయ్య, రాజిరెడ్డి, పాపయ్య, ఐలయ్య ఉన్నారు.

ఎంపీటీసీలకు సర్పంచుల బాధ్యతలు అప్పగించాలి

వీణవంక: సర్పంచుల పదవీకాలం ఈ నెలతో ముగిస్తుండటంతో ఎంపీటీసీలకు సర్పంచుల బాధ్యతలు ఇవ్వాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ఘన్ముక్కుల గ్రామంలో మంగళవారం మాట్లాడారు. సర్పంచుల మాదిరిగా ప్రజలతో ఎన్నికైన ఎంపీటీసీలకు బాధ్యతలు అప్పగిస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు ఎంపీటీసీలకు చిల్లి గవ్వ నిధులు ఇవ్వలేదని, ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామని ఆరోపించారు. ప్రజలకు ఎన్నో వాగ్దానాలు ఇచ్చి గెలిపిస్తే నిధులు, విధులు లేక క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నామని, ఎంపీటీసీలను చిన్నచూపు చూడటం తగదని, సర్పంచ్‌ల స్థానంలో అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించొద్దని ఈ విషయంపై పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

కళాకారులకు చేయూత

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లిలో గణేశ్ కళాబృందం సభ్యులకు అదే గ్రామానికి చెందిన పత్తం గంగారాం–శారద దంపతులు సంగీత వాయిద్య పరికరం డోలక్‌ను ఉచితంగా అందించారు. గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి కళాకారులకు అందివ్వగా కళాకారులు దాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గణేశ్ కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సమ్మన్న, అధ్యక్షులు పెద్దులు, రమేశ్, నరేశ్, రామస్వామి, శ్రీనివాస్, చిన్న సదయ్య తదితరులు ఉన్నారు.

నేతాజీకి ఘన నివాళి


హుజూరాబాద్‌లో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


జమ్మికుంట: నివాళి అర్పిస్తున్న కృష్ణారెడ్డి


మానకొండూర్: నివాళి అర్పిస్తున్న నాయకులు


సైదాపూర్: సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్ఐ ఆరోగ్యం

మానకొండూర్: మండల కేంద్రంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సుభాష్‌చంద్రబోస్ చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, తిరుపతి, శంకరాచారీ, తిరుపతి, కిరణ్, రమణ, రమేశ్‌పటేల్, రాంరెడ్డి, రమణయ్య, శ్రీనివాస్, ప్రదీప్‌యాదవ్, ఆరెల్లి సునంద్ పాల్గొన్నారు.

జమ్మికుంట: దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ది కీలక పాత్ర అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. జమ్మికుంటలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ ఆధ్వర్యంలో మంగళవారం నేతాజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో అజాద్ హింద్ ఫౌజ్ సేనాని స్థాపించి, బ్రిటీష్‌వారిపై పోరాటం చేశారని కొనియాడారు. గౌతం రెడ్డి, రఘు, కరుణాకర్, నరసింహారావు, సంపత్‌రావు, రవి, రాజ్‌కుమార్, ఈశ్వర్, వినోత్, స్వామి, స్వరూప, రవిచందర్‌రెడ్డి, రాజు ఉన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మొలుగూరి హరికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నేతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం భారత సైన్యాన్ని ఏర్పాటు చేసిన మహావీరుడు సుభాష్ చంద్రబోస్ అని ఎస్ఐ ఆరోగ్యం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా పెన్షనర్స్ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, నాయకులు తాళ్లపల్లి అమరేందర్, ఉప్పు శ్రీనివాస్, ఖాలిక్ హుస్సేన్, వేల్పుల రత్నం, రామ్, సారన్న, దాట్ల ప్రభాకర్, కలకోటి శ్రీనివాస్, సమ్మయ్య, తడికమల్ల శేఖర్, కె.రాజేందర్, టి రమేశ్, అచ్యుతాకర్ తదితరులు ఉన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని లక్ష్మీపూర్‌లోని నేతాజీ జయంతిని సుభాష్ యువజన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించింది. సంఘం అధ్యక్షుడు చెక్కిళ్ల సాయిరాంగౌడ్ నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభ్యులు జక్కు శ్రీకాంత్ గౌడ్, బొమ్మ రామకృష్ణ గౌడ్, గోపి, గణేశ్, రమేశ్, అరవింద్, జీవన్, శివ సాయి, అభినయ్ పాల్గొన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

హుజూరాబాద్: జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యూ కాకతీయ ఇ.మీ స్కూల్‌లో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నారు. ఈవిషయం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జీ పి.అలేఖ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

వీణవంక: వీణవంక మండల డెప్యూటీ తహసీల్దార్‌గా నిజామొద్దీన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీటీగా పని చేసిన కర్ర శ్రీనివాస్‌రెడ్డి తహసీల్దార్‌కు తెలియకుండా ఆయన డిజిటల్ కీని వినియోగించడంతో తహసీల్దార్ తిర్మల్‌రావు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాడు. దీంతో ఉన్నతాధికారులు ఆయనను బదిలీ చేయగా ఆయన స్థానంలోకి నిజామొద్దీన్ వచ్చారు.

నేడు పశువైద్య శిబిరం

రామడుగు: మండలంలోని దత్తోజీపల్లి, రంగసాయిపల్లి గ్రామాలలో బుధవారం మెగా పశు వైద్య శిబిరం నిర్వహించనున్నామని మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. శిబిరంలో పశువులకు వివిధ రకాల చికిత్సలు నిర్వహిస్తామని, ఆయా గ్రామాల రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత


మానకొండూర్‌రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సబిత, అధికారులు

మానకొండూర్‌రూరల్: బాలల పరిరక్షణ అందరి బాధ్యతని సీడీపీవో సబిత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా సబిత హాజరై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలలో బాలల పరిరక్షణ కమిటీలను వేయాలని, పిల్లల సమస్యలను తెలుసుకుని కమిటీల ద్వారా పరిష్కరించాలన్నారు. పిల్లలను చెడు వ్యసనాల నుంచి కాపాడాలని అధికారులకు సూచించారు. చైల్డ్‌హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ.. కమిటీ ఉద్దేశం, సభ్యులు చేయాల్సిన పనులను వివరించారు. ఆపదలో ఉన్న బాలలు 1098 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, డీసీపీఓ శాంత, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏపీఎం నిరంజన్, లేబర్ ఆఫీసర్ చక్రధర్, ఎస్సై శ్రీకాంత్, బాలల పరిరక్షణ అధికారి రమేశ్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అరుణ, విజయ, నిర్మల పాల్గొన్నారు.

అవగాహన సమావేశం


చొప్పదండి: మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్

చొప్పదండి: పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం బాలల పరిరక్షణపై అధికారులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన బాల్య వివాహాల నివారణ, బాలల హక్కులు, రక్షణ, సంరక్షణ, ఆదరణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లలపై లైంగిక వేధింపులు, అనాథ పిల్లల సంరక్షణ తదితర అంశాలపై చర్చించారు. పోక్సో చట్టం, 1098 టోల్ ఫ్రీ నంబర్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో స్వరూప, సీడీపీవో కస్తూరి, ఎస్ఐ ఉపేంద్ర చారి, సూపర్‌వైజర్ రమాదేవి, డి. శ్రీనివాస్ హాజరయ్యారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులతో ఎస్సై చందా నరసింహారావు

గన్నేరువరం: విద్యార్థులు క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై చందా నరసింహారావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన కబడ్డీ పోటీలను ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థి దశనుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బుర్ర మల్లేశంగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సైదాపూర్: మండలంలోని సోమారం ఆదర్శ పాఠశాల విద్యార్థి పి.మణికంఠ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణువర్ధన్ మంగళవారం తెలిపారు. కరీంనగర్‌లో ఈ నెల 21న జరిగిన ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలుర విభాగంలో పాల్గొని, ఈ నెల 23 నుంచి 25 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. మణికంఠను ప్రిన్సిపాల్ ఫర్హానా, అధ్యాపకులు అభినందించారు.

జీపీ భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, వార్డుసభ్యులు

జమ్మికుంట: మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని సర్పంచ్ వజ్జపల్లి ఆగయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండెకారి రాము, గుండెకారి సరోజన, మీసాల శంకర్, అరెపల్లి స్వరూప, తోర్నె సంజీవరావు, సూరం రవీందర్, శనిగరపు స్రవంతి, అయల చైర్మ న్ గొండె శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన


అంబేద్కర్ చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చొప్పదండి: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం ఓటరు నమోదుపై ప్రజలకు కళాకారుల బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సాంస్కృతిక సారథి కళాకారుడు మరళిగౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీలను వివరించారు. ఈ కార్యక్రమంలో కైరి తిరుపతిగౌడ్, దుర్గం మురళి గౌడ్, పొద్దుపొడుపు శంకర్, వొళ్ళాల వాణి, అర్చన, సంధ్యారాణి, రాధ, శ్రీకాంత్, సౌమ్య, ఉదయ్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియమకపత్రం అందిస్తున్న రవికుమార్

జమ్మికుంట: తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్‌గా కుర్రి ఏలియాను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్ మంగళవారం నియమకపత్రం అందజేశారు. పట్టణంలోని కొత్తపల్లి చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సారయ్య, చెరుకు రత్నరాజు, ఆయా మండలాల పాస్టర్లు శ్యామ్సన్, సామ్యూలు, అనంద్‌కుమర్, జాన్ మార్క్, రవీందర్, బాబు, ఇమ్మానియేలు, సురేందర్, శేద్రేక్, పూర్ణచందర్, మధునయ్య, థామస్, హెప్సిబా, పాల్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ పనులు పూర్తి చేయాలి


గంగాధర: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: పట్టణ శివారులో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులను ఆదేశించారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ గుర్రం నీరజ అధ్యక్షతన మంగళవారం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పట్టణంలో నీటి సరఫరా మెరుగుపరచడానికి మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను నగునూరు నుంచి పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో పూర్తి స్థాయి సిబ్బంది, అధికారుల నియామకం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మున్సిపల్ సమావేశానికి ఎమ్మెల్యే తొలిసారిగా రావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, మేనేజర్ ప్రశాంత్‌కుమార్, కౌన్సిలర్‌లు, అధికారులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తాం

గంగాధర: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని మధురానగర్ చౌరస్తా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం కళాశాల పోస్టర్ ఆవిష్కరించారు. మధ్యాహ్న భోజనం దాతగా ముందుకు వచ్చిన ఎమ్మెల్యేను కళాశాల సిబ్బంది సన్మానించారు. కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థినికి మలబార్ గోల్డ్ వారు ఇచ్చే రూ.పదివేలు, కాలేజీ టాపర్‌కు ఎలకపెల్లి లింగారెడ్డి–లక్ష్మి జ్ఞాపకార్థం రూ.పదివేలు ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీల పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న ప్రణవ్

వీణవంక: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యతను ప్రతి కార్యకర్త తీసుకోవాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీలకతీతంగా కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటానని, కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ప్రతి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేస్తామని, రాబోయే లోకసభ ఎన్నికల్లో పార్టీ ఏ అభ్యర్థిని బరిలో నిలిపిన అధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి, టీపీసీసీ మెంబర్ కర్ర భగవాన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్‌హుస్సేన్, నల్ల కొండాల్‌రెడ్డి, ఈదునూరి పైడికుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చదువు జైపాల్‌రెడ్డి, తదితరులుఉన్నారు.

బల్దియాకు రూ.200 కోట్లు కేటాయించాలి


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని విలీన గ్రామాలు, శివారు ప్రాంతాలు, నూతన కాలనీల సమస్యలు పరిష్కారం కావాలంటే వచ్చే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించాలని మేయర్ సునీల్‌రావు కోరారు. మంగళవారం నగరంలోని 14వ డివిజన్‌లో రూ.39 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు భూమిపూజ చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ రూ.500 కోట్లు కేటాయించినట్లుగానే, ఈ ప్రభుత్వం కూడా రూ.200 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నగరం మొత్తంగా అభివృద్ధి కావాలంటే అదనపు నిధులు అవసరమన్నారు. కార్పొరేటర్ దిండిగాల మహేశ్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ నిఖిత, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

కేసీఆర్ పేరు వింటేనే కాంగ్రెస్ నేతలకు వణుకు

కరీంనగర్: కేసీఆర్ పేరు వింటేనే కాంగ్రెస్ నాయకులకు వణుకు మొదలవుతుందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అడ్డగోలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై దృష్టిసారిస్తూ అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేందుకే శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్‌గా నామకరణం చేస్తే అందులో కేసీఆర్ పేరు ఉందని బోర్డును తొలగించడం కాంగ్రెస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని తెలిపారు. ఏడేళ్లుగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని, ఈ యేడు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేయడానికి పూనుకుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డు చెప్పడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నగర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, నగర యూత్ అధ్యక్షులు కుల్దీప్ వర్మ, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, మైనార్టీ నగర అధ్యక్షులు షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎడ్ల రమేశ్

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో పాటు కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసే విధంగా అవలంభిస్తున్న తీరును నిరసిస్తూ ఫిబ్రవరి 16న ఆల్‌ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జరిగిన తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. 1997 సెస్‌యాక్ట్‌ను 2020లో సవరణ చేయడం వల్ల కార్మిక సంక్షేమ నిధికి గండి పడిందని తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు 54 రకాల భవన నిర్మాణ కార్మికులు పాల్గొంటారని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కదిరె రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోశాధికారి జగదీశ్,ఉపాధ్యక్షుడు తిరుపతి,ఎల్లయ్య, రామ్మూర్తి, రాజకుమారి, సహాయ కార్యదర్శి ప్రసాద్, సారయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


తనిఖీ చేస్తున్న ఏవో రాజు

గంగాధర: మండలంలోని కురిక్యాల, మధురానగర్ చౌరస్తా, బూర్గుపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి రాజు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈపాస్ మిషిన్ పరిశీలించి ఎరువులకు సంబంధించి గ్రౌండ్‌స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా షాపుయజమానులకు పలు సూచనలు చేశారు. ఈ పాస్ ద్వారానే ఎరువులు అమ్మాలని, అమ్మిన వెంటనే రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు.